ఈనాడు గురువారం జులై 24, 2025

# ప్రపంచస్థాయి వర్సిటీగా 'డా.మన్మోహన్‌సింగ్ ఎర్త్ సైన్సెస్'

**● ఆగస్టులో ప్రారంభించనున్న సీఎం: మంత్రి తుమ్మల**

పాల్వంచ, ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: డా.మన్మోహన్‌సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ తెలంగాణలోనే కాదు.. ప్రపంచంలోనే ఈ తరహా తొలి విశ్వవిద్యాలయమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆ స్థాయిలోనే వినూత్న, విశిష్టమైనదిగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తామని చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని విశ్వవిద్యాలయంలో బుధవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. తొలుత ఇన్‌ఛార్జి వైస్ ఛాన్స్‌లర్‌గా విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా, రిజిస్ట్రార్‌గా రామచంద్రం బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడారు. ఆగస్టులో సీఎం రేవంత్‌రెడ్డి విశ్వవిద్యాలయాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. 312 ఎకరాల ప్రాంగణాన్ని సద్వినియోగం చేసుకొని మూడేళ్లలో అన్ని వసతులు కల్పిస్తామన్నారు. డాక్టర్ మన్మోహన్‌సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడే తెలంగాణ బిల్లును పార్లమెంట్ ఆమోదించిందని అందుకే వర్సిటీకి ఆయన పేరు పెట్టామని వివరించారు. యోగితారాణా మాట్లాడుతూ.. ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీలో అభ్యసించిన వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.



మహిళా కండక్టర్ నుంచి టికెట్ తీసుకుంటున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

## బస్సులో ప్రయాణించిన మంత్రి తుమ్మల

ఖమ్మం నగరంలోని నూతన బస్టాండ్‌లో బుధవారం జరిగిన మహాలక్ష్మి పథకం సంబురాలకు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు. గతంలో రఘునాధపాలెం మూలగూడెం గ్రామానికి బస్సు నడపాలని అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు ఆ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించటంతో బస్టాండ్‌లో దానిని ప్రారంభించారు. అక్కడి నుంచి గ్రామం వరకు బస్సులో ప్రయాణించారు.

ఈనాడు గురువారం జులై 24, 2025

# ఇంజినీరింగ్ తొలి విడతలో 59,980 మంది చేరిక

- బీటెక్ సీట్లు పొందినా ఆసక్తి చూపని 17,581 మంది
- మిగిలిన మొత్తం సీట్లు 23,074
- 25 నుంచి ఎప్‌సెట్ రెండో విడత కౌన్సెలింగ్
- మరో 5 వేల వరకు సీట్లు పెరిగే అవకాశం




ఈనాడు, హైదరాబాద్ : ఎప్‌సెట్ తొలి విడత కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన వారిలో 59,980 మంది ఇంజినీరింగ్‌లో చేరేందుకు ఆసక్తి చూపారు. కన్వీనర్ కోటాలో 83,054 బీటెక్ సీట్లు అందుబాటులో ఉండగా తొలి విడతలో 77,561 మందికి సీట్లు దక్కాయి. వారిలో 59,980 మంది మాత్రమే ఫీజు చెల్లించి... ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ చేశారు. అంటే 17,581 మందికి (22.66 శాతం) తాము సీట్లు పొందిన కళాశాలలు లేదా బీటెక్ బ్రాంచీలు నచ్చలేదు. సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు ఈ నెల 22న ముగియగా 59,980 మంది మాత్రమే (77.34 శాతం) ముందుకొచ్చారు. ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీల్లో కచ్చితంగా సీట్లు వస్తాయని స్పష్టమైన అంచనాకు వచ్చిన వారు కౌన్సెలింగ్‌లోనే పాల్గొనలేదు.

మిగతా 3లో

# ఇంజినీరింగ్ తొలి విడతలో 59,980 మంది చేరిక

(మొదటి పేజీ తరువాయి)

మరికొందరు జోసా కౌన్సెలింగ్ ద్వారా ఎక్కడ సీటు వస్తుందో... ఒకవేళ రాకుంటే ఎలా అని ముందుజాగ్రత్తగా ఎప్‌సెట్ కౌన్సెలింగ్‌లో పాల్గొన్నారు. అలాంటి వారిలో ఇప్పుడు స్పష్టత రావడంతో చేరేందుకు ఆసక్తి చూపలేదు. ఇంకొందరు యాజమాన్య కోటాలో సీట్లు పొందేందుకు, కొందరు ప్రైవేట్, డీమ్డ్ వర్సిటీల్లో చేరేందుకు వెళ్లి ఉంటారని, కొన్ని వేల మంది బీఎస్సీలో ప్రవేశించేందుకు మొగ్గు చూపి ఉండొచ్చని భావిస్తున్నారు.

## రేపటి నుంచి రెండో విడత ప్రారంభం...

ఈ నెల 25వ తేదీ నుంచి రెండో విడత కౌన్సెలింగ్ మొదలు కానుంది. ఆ రోజు ధ్రువపత్రాల పరిశీలనకు స్లాట్ బుక్ చేసుకోవచ్చు. ఈ నెల 26న ధ్రువపత్రాల పరిశీలన నిర్వహిస్తారు. ఈ నెల 26, 27 తేదీల్లో వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలి. వారికి 30వ తేదీ లేదా ఆలోపు సీట్లు కేటాయిస్తారు.

## పెరగనున్న బీటెక్ సీట్లు

రెండో విడతకు బీటెక్ సీట్లు పెరగనున్నాయి. తొలి విడతలో ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ పూర్తయిన అనంతరం 23,074 సీట్లు మిగిలాయి. కొన్ని కళాశాలలు అదనపు సీట్లకు దరఖాస్తు చేసుకున్నాయి. వాటిల్లో కోర్ బ్రాంచీలైన ఈసీఈ, సివిల్, మెకానికల్ కూడా ఉన్నాయి. సీఎస్ఈ సంబంధిత బ్రాంచీలతోపాటు మొత్తం కలిపి మరో 5 వేల వరకు కొత్త సీట్లు రావొచ్చని తెలుస్తోంది. ఏ ప్రాతిపదికన సీట్లు పెంచాలన్న దానిపై దాదాపు కసరత్తు పూర్తైందని సమాచారం. ఈ నెల 25వ తేదీన సీట్ల మంజూరుకు సంబంధించి ఉత్తర్వులు జారీ కానున్నాయి. సీట్లు పెరగడం వల్ల రెండో విడతలో మెరుగైన కళాశాల, బ్రాంచీకి విద్యార్థులు మారే అవకాశం ఉందని భావిస్తున్నారు.

**ప్రధాన బ్రాంచీల్లో ఇదీ సీట్ల భర్తీ పరిస్థితి**

| కోర్సు పేరు | మొత్తం సీట్లు | కేటాయింపు | చేరింది |
|---|---|---|---|
| సీఎస్ఈ | 28,246 | 27,657 | 21,286 |
| ఐటీ | 3,960 | 3,849 | 3,171 |
| సీఎస్ఈ(ఏఐ-ఎంఎల్) | 13,540 | 13,093 | 10,733 |
| సీఎస్ఈ(డేటా సైన్స్) | 7,600 | 7,295 | 5,677 |
| సీఎస్ఈ(సైబర్ టెక్నాలజీ) | 1,560 | 1,528 | 1,203 |
| ఏఐ అండ్ డేటా సైన్స్ | 1,301 | 1,276 | 947 |
| ఈసీఈ | 10,967 | 10,099 | 7,714 |
| ఈఈఈ | 4,695 | 3,519 | 2,526 |
| సివిల్ | 3,376 | 2,756 | 1,976 |
| మెకానికల్ | 3,230 | 2,401 | 1,600 |

గురువారం । 24 । జూలై । 2025
హైదరాబాద్ । www.sakshi.com

# మంచి కాలేజీకే మొగ్గు!

- సాధారణ ఇంజనీరింగ్ కాలేజీలపై విద్యార్థుల అనాసక్తి

సాక్షి, హైదరాబాద్: కొన్ని కాలేజీల్లో కంప్యూటర్ సైన్స్ బ్రాంచీలో సీటు వచ్చినా విద్యార్థులు ససేమిరా అంటున్నారు. మంచి కాలేజీ వస్తేనే చేరుతాం అంటున్నారు. ఇలా ఒకరిద్దరు కాదు. ఏకంగా 12,224 మంది ఇంజనీరింగ్ కంప్యూటర్, ఐటీ కోర్సుల్లో సీట్లు వచ్చినా చేరలేదు. జిల్లాలు, రాజధాని పరిసర ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి కన్పించింది. టాప్ 20 తర్వాత కాలేజీల్లో సీట్లు పెద్ద ఎత్తున మిగిలిపోయాయి. గ్రామీణ ప్రాంతాల్లోనైతే 50 శాతం సీట్లు కూడా భర్తీ అవ్వలేదు. రాష్ట్రంలో కన్వీనర్ కోటా కింద 83,054 ఇంజనీరింగ్ సీట్లున్నాయి. తొలి రౌండ్‌లో 77,561 సీట్లు కేటాయించారు. సీట్లు వచ్చిన వాళ్ళు ఈ నెల 22లోగా రిపోర్టు చేయాల్సి ఉండగా..అన్ని బ్రాంచీలకు కలిపి 59,980 మంది మాత్రమే సెల్ఫ్ రిపోర్టు చేశారు. అంటే కేటాయించిన సీట్లలో 17,581 భర్తీ కాలేదన్నమాట. కాగా తొలి రౌండ్‌లో కేటాయించని సీట్లు కలిపితే మొత్తం 23,074 సీట్లు మిగిలిపోయాయి.

**వీళ్లు ఆ కాలేజీల జోలికే వెళ్ళలేదు..**

ఎప్‌సెట్‌లో 20 వేల లోపు ర్యాంకు వచ్చిన విద్యార్థులు టాప్ 25 తర్వాత ఉన్న కాలేజీలకు అసలు ఆప్షన్లే ఇవ్వలేదు. కౌన్సెలింగ్‌లో పాల్గొన్న ఈ ర్యాంకు పొందిన వాళ్ళు 13,680 మంది ఉన్నారు. 20 నుంచి 30 వేల ర్యాంకు వచ్చిన విద్యార్థులు 13,967 మంది ఉన్నారు. వీళ్ళు టాప్ 25 నుంచి 50 కాలేజీలకు మూడు, ఆపైన ఆప్షన్లు ఇచ్చారు. ఇందులో సీట్లు వచ్చినా 90 శాతం మంది చేరేందుకు ఇష్టపడలేదు. కంప్యూటర్ సైన్స్ కోర్సులే వచ్చినా ససేమిరా అన్నారు. 50 నుంచి లక్ష ర్యాంకు ఉన్న విద్యార్థులు 25,096 మంది ఉన్నారు. వీళ్ళు అన్ని కాలేజీలకు ఆప్షన్లు ఇచ్చారు. వీరిలో 15 వేల మందికి సీఎస్ఈ, ఇతర కంప్యూటర్ కోర్సుల్లో సీట్లు వచ్చాయి. లక్ష నుంచి 1.50 లక్షల ర్యాంకులు వచ్చిన వాళ్ళు 17,753 మంది అన్ని కాలేజీల్లో కంప్యూటర్‌తో పాటు, ఇతర బ్రాంచీలకు ఆప్షన్లు ఇచ్చారు. 1.50 లక్షలపైన ర్యాంకర్లు 739 మంది కౌన్సెలింగ్‌లో పాల్గొన్నారు. వీళ్ళు సెల్ఫ్ రిపోర్టింగ్ చేసినా.. మరో రౌండ్ కోసం నిరీక్షిస్తున్నారు. మంచి కాలేజీ వస్తుందని ఆశిస్తున్నారు.

**తొలి రౌండ్ తర్వాత కొన్ని ముఖ్యమైన బ్రాంచీల వారీగా మిగిలిపోయిన సీట్ల వివరాలు..**

| బ్రాంచీ | అందుబాటులో | కేటాయించినవి | భర్తీ | మిగిలినవి | మొత్తంగా మిగిలినవి |
|---|---|---|---|---|---|
| సీఎస్ఈ, ఐటీ, ఎమర్జింగ్ | 58742 | 57042 | 44798 | 12224 | 13944 |
| ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్స్ | 16112 | 14054 | 10594 | 3460 | 5518 |
| మెకానికల్, సివిల్ | 7100 | 5632 | 3943 | 1689 | 3157 |

నమస్తే తెలంగాణ హైదరాబాద్, గురువారం 24 జూలై 2025

# రెండేండ్లలో ఐదు లక్షల మంది డ్రాప్

- ఏటా 2.5లక్షల చొప్పున తగ్గుదల
- రాష్ట్రంలో సర్కారు బడులు కుదేల్
- గణనీయంగా తగ్గిన ఎన్‌రోల్‌మెంట్
- బీఆర్‌ఎస్ హయాంలో పెరుగుదల
- అదే కాంగ్రెస్ పాలనలో తగ్గుదల



హైదరాబాద్, జూలై 23 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ అస్తవ్యస్త పాలనతో రాష్ట్రంలోని సర్కారు బడులు గాడితప్పుతున్నాయి. ప్రభుత్వ అసమర్థ విధానాల కారణంగా ఆదరణ కోల్పోతున్నాయి. నేను రాను బిడ్డో సర్కారు బడికి అన్నట్టుగా పరిస్థితులున్నాయి. ఈ రెండేండ్ల కాలంలో రాష్ట్రంలో ఐదు లక్షల మంది విద్యార్థులు సర్కారు బడుల నుంచి నిష్క్రమించారు. ఈ ఐదు లక్షల మంది సర్కారు బడులు వదిలి.. ప్రైవేట్ బడుల్లో చేరారు. 2022లో సర్కారు బడుల్లో 30.09లక్షల మంది విద్యార్థులుండగా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 2023-24 విద్యా సంవత్సరంలో ఈ ఎన్‌రోల్‌మెంట్ 27.79 లక్షలకు పడిపోయింది. ఇక 2024-25కు వచ్చేసరికి 24.96 లక్షలకు పడిపోయింది. ఈ రెండేండ్ల కాలంలో ఐదు లక్షల మంది విద్యార్థులు తగ్గిపోయారు. విద్యాశాఖను స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డియే పర్యవేక్షిస్తున్నారు. అయినా ఏమాత్రం మార్పురాకపోగా, సర్కారు బడులు మరీ అధ్వానంగా తయారవుతున్నాయి.

ఆందోళన కలిగించే విషయమేంటంటే సర్కారు బడుల్లో తగ్గి.. ప్రైవేట్ బడుల్లో ఎన్‌రోల్‌మెంట్ పెరగడం గమనార్హం. మొత్తం 30,137 ప్రభుత్వ బడులుండగా, 11,217 ప్రైవేట్ స్కూళ్లున్నాయి. మేనేజ్‌మెంట్‌వారీగా తీసుకుంటే సర్కారులోనే అత్యధికంగా బడులున్నాయి. ప్రైవేట్‌తో పోల్చితే రెండు రెట్లు అధికంగా సర్కారు బడులున్నాయి. కానీ వీటిల్లో ఎన్‌రోల్‌మెంట్ మాత్రం నిరాశజనకంగా ఉంది.

## కేసీఆర్ పాలనలో 5లక్షల పెరుగుదల

రేవంత్‌రెడ్డి పాలనలో సర్కారు బడులు నేలచూపులు చూస్తుంటే.. కేసీఆర్ పాలనలో స్వర్ణయుగాన్ని చూశాయి. కేసీఆర్ ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగా సర్కారు బడుల్లో ఎన్‌రోల్‌మెంట్ ఐదు లక్షలు పెరిగింది. సాక్షాత్తు ఇదే విషయాన్ని కేంద్రం

### సర్కారు బడుల్లో ఎన్‌రోల్‌మెంట్

| సంవత్సరం | ఎన్‌రోల్‌మెంట్ |
|---|---|
| 2022-23 | 30,09,212 |
| 2023 -24 | 27,79,713 |
| 2024-25 | 24,96,538 |

### కేసీఆర్ హయాంలో సర్కారు బడుల్లో ఎన్‌రోల్‌మెంట్ పెరుగుదల

| సంవత్సరం | ఎన్‌రోల్‌మెంట్ |
|---|---|
| 2019-20 | 28,37,635 |
| 2020-21 | 28,96,974 |
| 2021-22 | 33,03,699 |

తాజాగా పార్లమెంట్‌లో వెల్లడించింది. 2019 నుంచి 22 మధ్య కాలంలో సర్కారు బడుల్లో 4.66లక్షల మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందినట్టు కేంద్ర విద్యాశాఖ పార్లమెంట్ సాక్షిగా వెల్లడించింది. కాంగ్రెస్ పాలనలో సర్కారు బడుల్లో ఎన్‌రోల్‌మెంట్ తగ్గడంపై మాజీ కార్పొరేషన్ చైర్మన్, బీఆర్‌ఎస్ సోషల్ మీడియా నేత మన్నె క్రిశాంత్ ఆందోళన వ్యక్తంచేశారు. ఎన్‌రోల్‌మెం ట్ తగ్గుతున్న రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రి ఎవరో తెలుసా..? అంటూ ఎక్స్‌లో వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

# ఇంజినీరింగ్‌లో మళ్లీ 17వేల సీట్లు ఖాళీ

- సీటు వచ్చినా రిపోర్ట్ చేయని విద్యార్థులు
- రెండో విడతలో భర్తీ చేసే అవకాశం
- రేపటి నుంచి ఎప్‌సెట్ రెండో విడత కౌన్సెలింగ్



హైదరాబాద్, జూలై 23 (నమస్తే తెలంగాణ) : బీటెక్ ఫస్టియర్‌లో మరో 17,581 సీట్లు ఖాళీ అయ్యాయి. ఈ సీట్లు దక్కించుకున్న వారు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయలేదు. దీంతో ఈ సీట్లు మళ్లీ ఖాళీ అయ్యాయి. ఎప్‌సెట్ మొదటి విడత సీట్లను ఈ నెల 18న కేటాయించారు. 22లోపు రిపోర్ట్‌చేయాలని అధికారులు సూచించారు. 77,561 సీట్లకు 59,980 మంది మాత్రమే రిపోర్ట్ చేశారు. మరో 17,581 మంది విద్యార్థులు రిపోర్ట్ చేయలేదు. సీఎస్‌ఈ తత్సమాన బ్రాంచీల్లో 57,042 సీట్లకు 44,798 మంది, ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్‌లో 14,054 సీట్లకు 10,594 మంది, మెకానిక్ ఇతర బ్రాంచీల్లో 5,632 సీట్లకు 3,943 మంది చొప్పున మాత్రమే రిపోర్ట్‌చేశారు. డిమాండ్ ఉన్న సీఎస్‌ఈ తత్సమాన బ్రాంచీల్లోనూ ఏడువేల మంది సీట్లు వదులుకున్నారు. మొదటి విడతలో 5,493 సీట్లు నిండలేదు. 17,581 సీట్లు ఖాళీ అయ్యాయి. 23,074 సీట్లు భర్తీకాలేదు. ఈ మొత్తం సీట్లను శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న రెండో విడత వెబ్ కౌన్సెలింగ్‌లో భర్తీచేయనున్నారు. రెండో విడతకు సంబంధించి 25న విద్యార్థులు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, స్లాట్ బుక్ చేసుకోవచ్చు. 26న సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహిస్తారు. 26, 27న వెబ్ ఆప్షన్లు ఎంచుకోవచ్చు. 27న ఆప్షన్లు ఫ్రీజ్ చేసుకోవచ్చు. 30న సీట్లు కేటాయిస్తారు. 30 నుంచి ఆగస్టు 1 వరకు ఫీజు చెల్లించి, ఆన్‌లైన్‌లో రిపోర్ట్‌చేయాల్సి ఉంటుంది. 31 నుంచి ఆగస్టు 2 వరకు కాలేజీల్లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. 3లోగా కాలేజీల్లో చేరిన వారి వివరాలు అప్‌డేట్ చేయాలి. ఆ తర్వాత మిగిలిన సీట్లకు ఆగస్టు 5 నుంచి తుది విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.

గురువారం | హైదరాబాద్
24.07.2025
www.v6velugu.com

ప్రభాత
వెలుగు

# ఇంజినీరింగ్ కాలేజీల్లో 59,980 మంది రిపోర్టు

## 26 నుంచి సెకండ్ ఫేజ్ వెబ్ ఆప్షన్లు..

**హైదరాబాద్, వెలుగు:** రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కాలేజీల్లో ఎప్‌సెట్ ఫస్ట్ ఫేజ్ అడ్మిషన్ కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తయింది. ఫస్ట్ ఫేజ్‌లో సీట్లు అలాటైన వారిలో 59,980 మంది సెల్ఫ్ రిపోర్టు చేశారని అధికారులు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా బీటెక్ ఫస్టియర్‌లో మొత్తం 83,054 సీట్లుండగా.. 77,561 మందికి సీట్లు అలాట్ అయ్యాయి. వారికి బుధవారం రాత్రి వరకు ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్ట్ చేసేందుకు అవకాశం ఇచ్చారు. ఈ నేపథ్యంలో 59,980 మంది రిపోర్టు చేశారని టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ శ్రీదేవసేన తెలిపారు. దీంతో, రెండో విడతకు 23,074 సీట్లు ఖాళీగా ఉన్నట్టు ప్రకటించారు. కంప్యూటర్ సైన్స్, ఐటీ వాటి అనుబంధ కోర్సుల్లో 13,944 సీట్లు ఖాళీగా ఉన్నాయి. సీఎస్ఈలో 6,960, సీఎస్ఈ ఏఐఎంఎల్ కోర్సులో 2,807 సీట్లు, ఈసీఈలో 3,253, ఈఈఈలో 2,169, సివిల్ లో 1,400, మెకానికల్ 1,630 సీట్లు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయి. కాగా, ఈ నెల 26 నుంచి ఎప్‌సెట్ రెండో విడత అడ్మిషన్ కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది. 26న సర్టిఫికెట్ల వెరిఫికేషన్, 26, 27 తేదీల్లో వెబ్ ఆప్షన్ ప్రక్రియ కొనసాగనుందని అధికారులు ప్రకటించారు. ఈ నెల 30న సీట్ల అలాట్మెంట్ ఉంటుందన్నారు. వివరాలకు https://tgeapcet.nic.in వెబ్ సైట్ సందర్శించాలన్నారు.